## దటీజ్ తెలంగాణ

బీఆర్ఎస్ పాలన.. దీర్ఘకాలిక లక్ష్యాల సాధన, రుణాలు తీసుకుని సంపద పెంపు. రాష్ట్ర సంపద పెంచి, సంక్షేమ పథకాలు అమలు, తలసరి ఆదాయం పెంపు.

కేంద్రం తీరు.. రూ.100 లక్షల కోట్లకు రుణం పెంపు. దేశంలో తలసరి ఆదాయం పేద దేశాల కంటే తక్కువ.

సంక్షేమం



సాగు, ఇంటింటికీ నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్తును అందించాలన్న ఉద్దేశంతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగించే చర్యలకు కేసీఆర్ సర్కారు శ్రీకారం చుట్టింది. కొత్తగా 3,69,867 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసింది.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు

ప్రారంభం 2014

## మనమే నెంబర్ 1

తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్ర స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 7,778 మెగావాట్లు. గత పదేండ్లలో ఇది 141 శాతానికి పెరిగి 18,756 మెగావాట్లకు చేరింది. ఈ మార్చి నాటికి కేటీపీపీ నుంచి 600 మెగావాట్లు, లోయర్ జూరాల 240, పులిచింతల 120, కేటీపీఎస్ (స్టేజ్-7) 800, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ 1,080, సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి 1,200, రాష్ట్రం ఏర్పడిన కొత్తలో ఛత్తీస్‌గఢ్ నుంచి వెయ్యి మెగావాట్లు, 5,273 మెగావాట్ల సౌరవిద్యుత్తు, 128 మెగావాట్ల పవన విద్యుత్తు తదితరాలన్నింటితో కలిపి మొత్తంగా రాష్ట్ర స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 18,756 మెగావాట్లకు పెరిగింది.



### స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 141% పెంపు

**పదేండ్లలో మార్పు ఇది**


2014: **7,778** మెగావాట్లు

2023: **18,756** మెగావాట్లు

పెరుగుదల: **141** శాతం

**విశేషం:** విద్యుత్తు రంగంలో తెలంగాణ గడిచిన పదేండ్లలో స్పష్టమైన ప్రగతిని సాధించింది. 2014లో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్ 6,700 మెగావాట్లుగా ఉంటే, ప్రస్తుతం 15,497 మెగావాట్లకు (131 శాతం పెరుగుదల) చేరింది. దేశంలో మరే ఇతర రాష్ట్రంలో ఈ స్థాయిలో గరిష్ఠ విద్యుత్తు డిమాండ్‌లో పెరుగుదల నమోదు కాలేదు.

**దేశంలో విద్యుత్తు పీక్ డిమాండ్.. సరఫరాలో లోటు ఇలా.. (గిగావాట్లలో) సంవత్సరాల వారీగా..**




**ఆధారం:** గ్రిడ్ ఇండియా

**నోట్:** తెలంగాణలో విద్యుత్తు సరఫరాలో లోటులేదు.

# మనసున్న మారాజు రామన్న

**కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన కేటీఆర్**

**వృద్ధురాలికి ఇల్లు కట్టించిన పెద్ద కొడుకు..**

**పెద్దన్నగా ఉద్యోగాలిప్పించి.. బతుకులకు భరోసా**

## ఆపదలో ఎవరున్నా ఆదుకునే నైజం

అన్నా ఆపదలో ఉన్నా ఆదుకోమంటూ వేడుకోగానే స్పందించే గుణం. పార్టీ జెండా మోసిన కార్యకర్త అకాల మరణం చెందితే ఆ కుటుంబానికి పెద్ద దిక్కై అండగా నిలిచిన పెద్దన్న. తోడూనీడా లేని మహిళలకు గూడు కట్టించిన మనసున్న మారాజు రామన్న. ఇలా ఎంతోమందికి తానున్నానంటూ భరోసా ఇస్తూ స్థానిక శాసనసభ్యుడిగా, ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రిగా కేటీఆర్ సిరిసిల్ల ప్రజలకు అండగా నిలుస్తున్నారు. నేరుగా కలిసి చెప్పుకొన్నా.. ట్విట్టర్, వాట్సాప్‌లో సందేశం పంపించినా తక్షణం స్పందించి ఆపన్నహస్తం అందించే కేటీఆర్ వెంటే ఉంటామంటున్నారు సిరిసిల్ల ప్రజలు.

... రాపెల్లి సంతోష్‌కుమార్



### ఉద్యోగమిప్పించి .. జీవితానికి భరోసానిచ్చి

మా నాన్న కత్తెర చొక్కారాం. అమ్మ విజయలక్ష్మి మాజీ కౌన్సిలర్. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో ఉంటాం. నాన్న కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా పని చేశారు. కేటీఆర్ శాసనసభ్యుడిగా గెలిచిన తర్వాత సిరిసిల్లను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రామన్నపై అభిమానంతో మా నాన్న బీఆర్ఎస్‌లో చేరారు. ఆరోగ్యం బాగాలేకపోవడంతో 2016లో నాన్న చనిపోయారు. విషయం తెలుసుకున్న మంత్రి కేటీఆర్ హైదరాబాద్ నుంచి హుటాహుటిన వచ్చి నివాళులర్పించారు. మా కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చి పరిశ్రమల శాఖలో నాకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించారు. రామన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

-కత్తెర పవన్‌కుమార్, సిరిసిల్ల

### కార్యకర్త కుటుంబానికి అండగా...

మాది వీర్నపల్లి మండలం గర్జనపల్లి. నా భర్త దేవేందర్. నాకు ఇద్దరు ఆడపిల్లలు. కేటీఆర్‌పై ఉండే అభిమానంతో మా ఆయన బీఆర్ఎస్ పార్టీ కోసం పనిచేశారు. నేను బీడీల పని చేస్తుంటా. ఈ ఏడాది జనవరిలో మా ఆయన గుండెపోటుతో చనిపోయిండు. పరామర్శించేందుకు వచ్చిన రామన్న మా ఆడ పిల్లలను చూసి 'బాధపడకమ్మా నేనున్నా' అంటూ ధైర్యం ఇచ్చిండు. ఇద్దరు బిడ్డల పేర్ల మీద రూ. 2.50 లక్షల చొప్పున రూ.5 లక్షలను బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, బాండ్ పేపర్లు తెచ్చి మా చేతికిచ్చిండు. మా కుటుంబానికి అండగా నిలిచిన మా పెద్దన్న రామన్న భారీ మెజారిటీతో గెలువాలే.

-ఈసంపల్లి హేమ, వీర్నపల్లి



### వెయ్యి మందికి ఉపాధి

నా భర్త సత్తయ్య సాంచాలు నడుపుతడు. మాకు ఇద్దరు ఆడబిడ్డలున్నరు. మా ఇండ్ల అందరూ బీడీల పనే జేస్తరు. బీడీల కంపెనీలు సరిగ్గా నడుస్త లేవు. ఏడాది కిందట కుట్టు పని నేర్చుకున్నా. మా వార్డు కొచ్చిన కేటీఆర్ సారుకు 'బీడీల పని లేకుంట పోయింది. ఏదైనా పని కల్పించాలి' అని చెప్పినం. మీ అందరి కోసం కంపెనీలు పెట్టిస్తున్నానన్నరు. అందులో ఉపాధి దొరుకుతుందని చెప్పారు. అన్నట్లే అప్పారెల్ పార్కులోని గ్రీన్ నిడిల్ కంపెనీలో పని కల్పించిర్రు. నాతో పాటు వెయ్యి మందికి పని దొరికింది.

-ఆడెపు ఉమారాణి, నేత కార్మికురాలు

### నా పెద్దకొడుకు కేటీఆర్ ఇల్లు కట్టించిండు

నా లాంటి పరిస్థితి పగోడికి కూడా రాకూడదు. మాది రామచంద్రాపూర్, తంగళ్లపల్లి మండలం. నా పెనిమిటి నర్సయ్య. ఇద్దరు కొడుకులు, ఓ బిడ్డ ఉన్నరు. కూలీ పనికి పోతుంటిమి. ఎనిమిదేండ్ల కింద నా పెనిమిటి ఆరోగ్యం బాగా లేక చనిపోయిండు. ఆయన పోయిన ఏడాదికే పెద్ద కొడుకు చనిపోయిండు. బిడ్డ వసంతకు పెండ్లి చేస్తే మొగుడు వదిలిపెట్టి పోయిండు. ఇద్దరు కొడుకులతో కలిసి నా బిడ్డ వసంత నా వద్దనే ఉంటున్నది. నా మనుమడు రోహిత్ మురుగు కుంటలో పడి చనిపోయిండు. మరో మనుమడు రమేశ్ పసీర్కలై చనిపోయిండు. నా చిన్న కొడుకు ప్రభాకర్ పెండ్లి అయిన ఆరు నెలలకే కాలం జేసిండు. పెనిమిటి, కొడుకులు, మనుమలు అందరూ పోయినంక ఈ బతుకు మీద రోత పుట్టింది. 2017లో మా ఊరికొచ్చిన కేటీఆర్‌ను కలిసిన. ఊరి వాళ్లు కేటీఆర్‌కు నా బాధ చెప్పిండ్రు. ఏడుస్తున్న నన్ను దగ్గరకు తీసుకుని అవ్వా నీకు నేనున్న అని ఓదార్చిండు. రూ.7 లక్షలు సొంత పైసలతో మంచి ఇల్లు కట్టించిండు. నా బాగోగులు చూసుకుంటున్న పెద్ద కొడుకున్నడన్న కొండంత ధైర్యం వచ్చింది.

-మేడిపల్లి నీలవ్వ, రామచంద్రాపూర్

## సోషల్ యాంగిల్



### తెర్లుజేస్తరట

సంపద మనం పెంచితే
ఆల్లు తుంచుతరట..
గడ్డి మనమేస్తే
పాలు ఆల్లు పిండుతరట..
ఒంట మనం జేస్తే
ఆల్లు ఒడ్డిస్తరట..
తెలంగాణను తెల్లగజేస్తే
ఆల్లు తెర్లుజేస్తరట..
అందుకే 'తెలంగాణ' అంటే అల్లకు అధికారం
మనకు మమకారం
అటీటెందుకు..
పద ముందుకిగ.



### మీ ఖాతానా?


తెలంగాణ ఇచ్చింది
మీ ఖాతానే అయితే..
మరి 1,200 బలిదానాలు,
కడుపు కోతలు,
లాఠీ దెబ్బలు,
తూటాల మంటలు..
ఇవన్నీ ఎవరి ఖాతా?
మీరియ్యలే.. మెడలు ఒంచి
మేమే తెచ్చుకున్నం తెలంగాణను.

● సురేందర్ బండారు

---

రైతు కష్టం.. వ్యవసాయ రంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న ముఖ్యమంత్రి దేశంలో కేసీఆర్ మాత్రమేనని అంటున్నారు కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారుడు పీ చెంగల్‌రెడ్డి. కాంగ్రెస్, బీజేపీలు అన్నదాతకు నమ్మకద్రోహం చేస్తే.. కేసీఆర్ మాత్రం అండగా నిలబడ్డారని, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేశారని అంటున్నారు. దేశ రైతాంగానికి కేసీఆర్ ఆశాకిరణమని, ఆయన మాత్రమే దేశ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలరని చెప్తున్నారు. రైతాంగమంతా కేసీఆర్ వెంట నడవాల్సిన తరుణమిదని పిలుపునిస్తున్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి 'నమస్తే తెలంగాణ'తో ఆయన తన అభిప్రాయాలను పంచుకున్నారు.

... ఎక్కల్‌దేవి శ్రీనివాస్




చెంగల్ రెడ్డి

# దేశ రైతాంగానికి ఆశాకిరణం.. కేసీఆర్

**వ్యవసాయ రంగంపై అవగాహన ఉన్న నేత.. తెలంగాణలో వ్యసాయానికి జీవం పోశారు**

**కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ ముఖ్య సలహాదారు చెంగల్ రెడ్డి**

**తెలంగాణ వ్యవసాయ రంగంలో ఈ పదేండ్లలో మీరు చూసిన మార్పులేంటి ?**

వ్యవసాయ రంగాన్ని కేసీఆర్ పునర్నిర్మించారు. రైతు పక్షపాతిగా రైతుల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారు. రైతాంగానికి 24 గంటల నిరంతరాయ ఉచిత విద్యుత్తు సరఫరా అవుతున్నది. రైతుబంధు పథకంతో కేసీఆర్ ప్రభుత్వం పెట్టుబడి సాయాన్ని అందిస్తున్నది. రుణమాఫీ చేస్తున్నది. ఇవన్నీ రైతులకు ఆర్థిక భరోసాను కల్పిస్తున్నాయి. కాళేశ్వరం ద్వారా 60 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందుతున్నది. రాష్ట్రంలో ఇప్పుడు ఎక్కడికి వెళ్లినా.. ఎకరం కనీసం రూ.15-20 లక్షలు పలుకుతున్నది. గతంలో సాగునీరు లేక ఇక్కడి రైతులు వలసలు వెళ్లేవాళ్లు. ఇప్పుడు ఇతర రాష్ట్రాల నుంచి వ్యవసాయ పనుల కోసం తెలంగాణకు వలస వస్తున్నారు. ఇవన్నీ ఈ పదేండ్లలో వచ్చిన మార్పులే. తెలంగాణ వ్యవసాయ మాడల్‌ను దేశ వ్యాప్తంగా అమలు చేయాల్సిన అవసరం ఉన్నది.

**దేశంలో వ్యవసాయ రంగం అభివృద్ధికి కాంగ్రెస్, బీజేపీ ఎలా పని చేస్తున్నాయి ?**

కాంగ్రెస్, బీజేపీలు రెండూ అన్నదాతలకు నమ్మకద్రోహం చేస్తున్నాయి. వ్యవసాయ రంగానికి మేలు చేసేలా ఆ పార్టీలు పని చేయడం లేదు. దేశంలో సుమారు 254 చక్కెర కర్మాగారాలు



మూతబడ్డాయి. చక్కెర నుంచి ఇథైల్ ఆల్కహాల్ తయారీపై కేంద్రం దృష్టి పెట్టి ఉంటే ఇలా మూతపడేవి కాదు. లాబీయింగ్‌కు తలొగ్గకుండా ఇలాంటి నిర్ణయాలు తీసుకోగలిగేది కేసీఆర్ మాత్రమే. ఆయనకు మాత్రమే వ్యవసాయం, రైతాంగంపై సంపూర్ణ అవగాహన ఉన్నది. జాతీయ స్థాయిలో వ్యవసాయ రంగానికి మేలు చేసేలా గుండె ధైర్యంతో విధానపరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈ దిశగా కేసీఆర్ కీలకపాత్ర పోషించగలరు. దేశంలో వ్యవసాయ సమస్యలపై కేసీఆర్ ఒక్కరే మాట్లాడుతున్నారు. ప్రపంచంతో మన దేశ వ్యవసాయం రంగం పోటీ పడేలా కేసీఆర్ చేయగలరని విశ్వసిస్తున్నా.

**అన్ని వనరులున్నా మన దేశం వ్యవసాయంలో వెనుకబడటానికి కారణాలేంటి ?**

దేశంలో వ్యవసాయరంగం అంత సవ్యంగా లేకపోవడానికి ప్రధాన కారణం.. ప్రభుత్వాల పాలసీలు విఫలమవ్వడమే. ఇజ్రాయెల్‌లో సరైన పాలసీలతోనే రైతులు విజయాన్ని సాధించారు. తెలంగాణలో వ్యవసాయ దిగుబడులు పెరిగేలా కేసీఆర్ మంచి విధానాలను రూపొందించారు. ఈ దిశగానే దేశంలోనూ వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం సరైన పాలసీలను రూపొందించాలి. జెనెటిక్ టెక్నాలజీ వంటి కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటే భారతదేశం వ్యవసాయంలో చైనా, అమెరికాలతో పోటీ పడగలదు. ఈ దిశగా నిర్ణయాలు తీసుకోగలిగేది, రైతాంగం ఎదుర్కొంటున్న కష్టాలను శాశ్వతంగా పరిష్కరించగలిగే విజన్ కేసీఆర్‌కు ఉన్నది.

**తెలంగాణ రైతాంగానికి మీరు చేసే సూచనలు ?**

కేసీఆర్ చేసిన సంస్కరణల వల్ల తెలంగాణ రైతాంగానికి సామాజికంగా గుర్తింపు దక్కింది. రైతులు ఆర్థికంగా బలపడ్డారు. ఇందుకు కృతజ్ఞతగా ఇప్పుడు యావత్తు రైతాంగం సీఎం కేసీఆర్ వెంట నడవాల్సిన అవసరం ఉన్నది. కేసీఆర్ మూడోసారి గెలిస్తే అది వ్యవసాయ రంగం సాధించే గెలుపు అవుతుంది. దేశంలోనూ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు రావడానికి కేసీఆర్ సాధించబోయే విజయం దోహదపడుతుంది.

## ఓటర్ల మాట

### విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్



హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చెందిందంటే ముమ్మాటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఘనతే. సమాచార, శాస్త్ర సాంకేతిక రంగాల్లో పరిపూర్ణ అవగాహన ఉన్న నాయకుడు ఐటీ మినిస్టర్ కావడంతోనే ఇది సాధ్యమైంది. ఐటీ పట్ల విజన్ ఉన్న నాయకుడు కేటీఆర్. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఐటీ కంపెనీలను విస్తరింపజేశారు. కంటోన్మెంట్ మూడు వైపులా అభివృద్ధి చెందింది. నగరంలో కంటోన్మెంట్ విలీనమైతే నాలుగో (ఉత్తరం) వైపు సైతం అభివృద్ధిలో వేగం పుంజుకుంటుందనడంలో సందేహం లేదు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కంటోన్మెంట్ అభివృద్ధికి సహకరించాలి.

- సంకి రవీందర్, కంటోన్మెంట్ వికాస్ మంచ్ కో కన్వీనర్


### ఆహ్లాదం పంచుతున్న పార్కులు



హైదరాబాద్ వాసులకు పార్కులు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. బీఆర్ఎస్ సర్కారు వచ్చాక కాలనీలు, బస్తీల్లో రూ.కోట్లతో కొత్త పార్కులను ఏర్పాటు చేయడంతో పాటు పాత వాటిని ఆకట్టుకునే డిజైన్లతో మరింత సుందరంగా తీర్చిదిద్దారు. ఉరుకులు, పరుగుల జీవితంలో కొద్దిసేపు సేదతీరేందుకు, ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్‌కు ఇవి ఎంతో ఉపయోగపడుతున్నాయి. పార్కుల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లను యువత సద్వినియోగం చేసుకుంటున్నది. చిన్నారుల కోసం ఎన్నో ఆట వస్తువులు అందుబాటులో ఉన్నాయి. ఔషధ గుణాల మొక్కల పెంపకంతో మంచి ఆరోగ్యం లభిస్తున్నది. పచ్చదనం చూస్తుంటే మనస్సుకు ఎంతో ఆనందం కలుగుతున్నది.

-వెంకట్‌రెడ్డి, సాఫ్ట్‌వేర్, శేరిలింగంపల్లి

### అనాథలకు అండగా..



హైదరాబాద్.. నాంపల్లిలో 1921 సంవత్సరం నుంచి కొనసాగుతున్న అనీసుల్ గుర్బా అనాథ ఆశ్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో తీర్చిదిద్దింది. అయినవారెవరూ లేక నిరాశ్రయులైన ఎంతో మంది ఈ శరణాలయంలో తలదాచుకుంటున్నారు. భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వారందరికీ భరోసా కల్పించేందుకు బీఆర్ఎస్ సర్కారు రూ.20 కోట్లతో కొత్త భవనాన్ని నిర్మించింది. ప్రస్తుతం ఇక్కడ దాదాపు 60 మంది ఉన్నారు.

- అబిడ్స్